# జగన్నాథం ప్రేమించాడు

జగన్నాథాన్ని తలుచుకుంటుంటే ఆశ్చర్యంగా వుంది. ఓ సామాన్యమైన పల్లెటూళ్ళో పుట్టి, ఒకళ్ళ పంచనవాళ్ళ దయా దాక్షిణ్యాలమీద బ్రతికిన జగన్నాథంలో యింతటి తెగువ, యింతటి ప్రత్యేకత వున్నాయని చూసిన వాడిని కాబట్టి నమ్మక తప్పడం లేదు.

జగన్నాథం గురించి ఒక కథంటూ రాయవలసి వొస్తుందనీ, ఆ రోజున వాడి వ్యక్తిత్వాన్ని హర్షించవలసి వొస్తుందనీ, నే నింతకు మునుపు కలనైనా అనుకోలేదు.

జగన్నాథం మా నాన్నగారి దగ్గర పెరిగి పెద్దవాడయ్యాడు. అతను మావయ్యగారబ్బాయి. వాడి దురదృష్టంకొద్దీ వాడు భూమ్మీద పడ్డ సంవత్సరంలోనే తల్లీ దండ్రీ దూరమయ్యారు. మావయ్యకి వ్యసనాలు చాలా వుండేవనీ, ఆ వ్యసనాలతోటే ఆయన పతనమై పోయారనీ, పెరిగి ప్రయోజకుడవాల్సిన కొడుక్కి ఆస్తి రూపేణా కాణీగూడా మిగిల్చిపోలేదనీ మా ఊళ్ళో అనుకునేవారు. మావయ్యపట్ల నాన్నకున్న అభిమాన మనండీ, జగన్నాథంలాటి అభాగ్యుడ్ని చేరదీసి పదిమందిలోనూ

---

1963, జూలై - జ్యోతి

'భేష్' అనిపించుకోవాలనే తాపత్రయం అనండీ, లేదూ కేవలం ఆ పసికూనమీద వల్లమాలిన అనురాగమనండీ మీ యిష్టం - నాన్న వాడిని చేరదీసి మాతోపాటు పెంచేరు.

చదువుపట్ల వాడికి విపరీతమైన బద్ధకం వుండేది. దానికితోడు ప్రతి దానిమీదా అలక్ష్యభావం ఒకటి, వాడి నరనరాల్లోనూ పనిచేయడం మూలంగా "భ్రష్టుడు" అనే పదాన్ని వాడినెత్తిన రుద్దడం జరిగింది.

చాటుగా నాన్నని చాలామంది అనేవారు. "కొడుకుల సుఖాలు కావలసిన ఆ పెద్దమనిషికి వాడెవడసలూ ? ఏనాడు, ఏ ముహూర్తంలో పుట్టాడోగాని జగన్నాధం దౌర్భాగ్యుడే సుమాండి" అని.

నాన్నవరకూ యీ 'సరస సంభాషణ' వొచ్చినా ఆయన పట్టించుకునేవారు కాదు. ఆయనకి మరొకళ్ళు చెప్పే పద్ధతీ అంటే తగని మంట, అలాటి అవసరం రానే కూడదంటా డాయన. ఆయనకై ఆయన నమ్మేది శాస్త్రం. ఆయన చేసేది న్యాయం. తను నిర్మించుకున్న పరిధిని దాటి బయటపడి "అయ్యో తమరి ఉద్దేశ్యమేమిటో సెలవిచ్చారు గాదూ" అని అడిగే తత్త్వం బొత్తిగా నయించ దాయనకి.

కాబట్టి జగన్నాధం గురించీ, మా నాన్నగారి గురించీ టూకీగా వివరించానన్న మాటేగా.

అనన్య సామాన్యులైన మా నాన్నదగ్గర పెరిగిన అతిసామాన్యుడైన మా జగన్నాధం యింత ఘనకార్యం చేశాడంటే ఒక పట్టాన నమ్మలేకపోయాను. కళ్ళు తిరిగేలా ఆశ్చర్య పోయేను.

అప్పట్లో బందరు కాలేజీలో బి. కాం. ఫైనలియరు చదువుకుంటున్నాను. బందర్లోనే ఒక చివరిని చిలకలపూడి అని చెప్పి ఒక పేట వుంది. ఆ పేటని సాక్షాత్తు పండరీపురమని యిప్పటికీ పిలుస్తూంటారు జనం. అక్కడ పాండురంగ విఠల్ ఉత్సవాలు బ్రహ్మాండంగా,

కన్నుల పండువగా ప్రతి సంవత్సరమూ జరుపుతుంటారు. ఉత్త రోజుల్లో బందరంటే గిట్టని చాలామంది ఆ ఉత్సవాల్లో మాత్రం బందరు పురాన్ని పావనం చేసేందుకు ఎక్కడెక్కడ్నుంచో వొస్తుంటారు.

ఒకనాటి సాయంత్రం నా రూమ్ దగ్గర రిక్షా ఆగింది. దాంట్లోంచి జగన్నాధం ఒక్కడే దిగుతే నా తల దిమ్మెత్తేదిగాదు - వాడితోపాటు ఒక చక్కటి ఆడకూతురూ దిగడంతో విశేషమనిపించి ఉలిక్కిపడక తప్పిందికాదు. ఒకమాటు కళ్ళు నులుముకుని మళ్ళా చూసేను. నిజమే— వాడితోపాటు దిగినది ఆడపిల్లే.

జగన్నాధం గబగబా లోపలి కొచ్చేడు. ఆ అమ్మాయి మాత్రం అరుగు ప్రక్కనే నించుండిపోయింది.

"తిరనాళ్ళకి వొచ్చాం" అన్నాడు వాడు.

"కనపడుతూనే వుంది" అన్నాను నేను.

"మళ్ళా రేపొద్దున వెళ్ళిపోతాం"

"అలాగా"

"ఈ రాత్రికి సినిమా చూచుకుని. యిక్కడే నిద్రపోయి తెల్లారి వెళ్ళిపోతాం"

"వొచ్చాం" "పోతాం" అనే పదాలు వాడు అయినకాడికి ఉపయోగించడంతో గుటకలు మింగటం నావంతు అయింది. నాకు తెలిసినంతవరకూ జగన్నాధ మనబడే మా మావయ్య కొడుకు ఒక్కనాడు గూడా "పరాయి మనిషి"తో మాట్లాడినట్టు జ్ఞాపకంలేదు. అలాటిది వయస్సులోవున్న ఒక ఆడపిల్లని వెంటబెట్టుకు తిరణాల కొచ్చేమనీ, సినిమా చూస్తామనీ, రాత్రికి యిక్కడే వుంటామనీ, తెల్లారిగట్ట వెళ్ళిపోతామనీ చెప్పేస్తూంటే వినేవాడికి నాకెలా వుంటుంది ? ఆ పిల్లవైపు చూస్తూ వాడే అన్నాడు-

"రా సీతా ! అక్కడే నిలబడిపోయావే ? మావాడేలే. దొడ్లో నీళ్ళుంటాయిగాని మొహం కడుక్కో."

సీత మహలావు సిగ్గుపడిపోయింది. ఆడపిల్లకి సిగ్గే అందమన్నారని చెప్పడం కాదుగాని, ఆపిల్ల అలా సిగ్గుపడిపోతూంటే అందంలో ఆమెకు సాటి యెవరూ అని ఛాలెంజి చేసినట్టుంది.

ఇంతకీ ఆ పిల్లెవరో, జగన్నాథానికీ, ఆ పిల్లకీ సంబంధమేమిటో తెలీకుండానే వుంది. జగన్నాథాన్ని నాకై నేను అడిగి తెలుసుకోవాలనే ఉద్దేశ్యం లేనేలేదు.

సీత దొడ్లోకి వెళ్ళింది. జగన్నాథానికి సబ్బూ, టవలూ యిచ్చి పంపాను. వీధి అరుగుమీద కూర్చుని సిగరెట్టు ముట్టించేను.

"సీత చాలా మంచి పిల్లరా చిన్నా !" అన్నాడు జగన్నాథం, దొడ్లోనుంచి వొచ్చి నా వెనక నిలబడి.

వాడివైపు చూశాను.

"పాపం, తిరునాళ్ళు చూడాలని ముచ్చట పడితేనూ,నాకూ చూడాలని వుందనుకో; ఎలాగో నువ్విక్కడే వుంటున్నావ్ గనుక, యిబ్బంది పడక్కర్లేదు రమ్మని తీసుకొచ్చాను."

ఈ మాత్రం నేనూ ఊహించలేననుకున్నాడో ఏమో, ఇంతకీ యీసోది చెపుతాడేగాని సీత యెవరు? ఆపిల్లకీ వీడికీ వున్న సంబంధం యేమిటీ వగైరాలు చెప్పనే చెప్పడు.

"మా నాన్నకి చెప్పే వొచ్చేవా ?"

"చెప్పాను."

"ఏమిటీ, మీరిద్దరూ కలిసి యిలా వొస్తున్నట్టు ?" రెట్టించి అడిగేను.

"అదెందుకు చెప్పాలి ? ముసలయ్యంటే మీ నాన్నకి బొత్తిగా

పడదు. ముసలయ్య కూతుర్తో వెళ్తానని చెపుతే నన్ను పంపుతాడనే అనుకున్నావా ?" అని దొడ్లోకి వెళ్ళిపోయాడు జగన్నాధం.

రైటో. డొంక కదిలింది. ఇప్పటిగ్గాని సీత యెవరో అర్థమైంది కాదు. ముసలయ్య మా పక్క ఊర్లో వుంటూన్న ఒకానొక బాగా చితికిపోయిన రైతు. ఆశాస్త్రీ నాన్నగారికి బాకీపడి రెండుమూడుమాట్లు చివాట్లు పెట్టించుకున్న వైనమూ, చివరికి ఆ బాకీ బాకీగానే నిలిచిపోయిన విషయమూ నేనింకా మరిచిపోలేదు.

ముసలయ్యకి యింత చక్కని కూతురున్నదని నాకు తెలీనే తెలీదు. పల్లెటూళ్ళో పుట్టినా సంవత్సర కాలంలో చాలా నెలలు బందరు లాంటి బస్తీల్లో గడిపే నా లాంటి వాడికి మా ఊళ్ళో ఎవరు ఎవరో తెలీదని చెప్తే మీ రెందుకు నమ్మరు ? అలాటిది మా పక్క ఊళ్ళో జనాభా వివరాలు నా కేం తెలుసు ? ముసలయ్యంటే నాన్నకి బాకీ పడ్డ ఆసామి కాబట్టీ, సాక్షాత్తూ నా ఎదుటనే ఆయన్ని నాన్నగారు చివాట్లు పెట్టడం జరిగింది గాబట్టీ - ఆ వ్యక్తి అయినా తెలుసు. ఆ ముసలయ్యకో కూతురుందనీ ఆ కూతురు చాలా చక్కటి పిల్లనీ, పిల్లపేరు సీతమ్మనీ - యివన్నీ నా కెలా తెలుస్తాయి ? కాబట్టి - ఈ తెలీకపోడంలో మన్నించరాని నేరం లేదనేగా మరి.

నేను ముసలయ్య గురించి లోగడే కొంత వినివున్నాను. అతను దగుల్బాజీ - ఇది మా నాన్న అనగా విన్నది. అతను తాగుబోతు - మా వూరి జనం అనేవారు. అత నెందుకూ పనికిరాని చవట - నాన్నకి ఆప్తులైన యిద్దరు ముగ్గురు (చవటలంటే గిట్టని) స్నేహితులు మనని చేసుకునేవారు.

నేను విన్న ముసలయ్య అలాంటివాడు. ఆ ముసలయ్య కూతురు సీత సీత 'అందమైనపిల్ల. అందమైన జగన్నాధంతో తిరనాళ్ళకి

ఒచ్చింది. ఆ పిల్ల జగన్నాథంతో వొచ్చిందని నాన్నకి తెలీదు. తెలుస్తే జగన్నాథాన్ని పంపకపోను. ఏతా వాతా సీత కథ ఏమిటయ్యా-అంటే మీ రప్పుడే అర్థం చేసుకున్నారు-కథని.

అయినా మనకో మోడెస్టీ అంటూ ఒహటి వుంటుంది చూడండి. అది అడ్డుపడి "వొరే జగన్నాథం నువ్వా పిల్లని కొంపతీసి లవ్ చేసే వేమిట్రా" అని అడగనివ్వదు. వప్పుకుంటారుగా.

ఇక కథ;

సీత లోపలికివచ్చి ఒక చేత్తో అద్దం పట్టుకుని మరోచేత్తో టవల్ పుచ్చుకుని అద్దంలో చూస్తూ మొహం తుడుచుకుంటోంది. మధ్య మధ్య దొడ్లోఉన్న జగన్నాథాన్ని తొంగి తొంగి చూస్తూను.

చెప్పద్దూ - నాకు జాలి కలిగిన మాట నిజం. పాపం వాళ్ళు అమాయక ప్రేమికులే ! వాళ్ళ మధ్య అడ్డుగోడలూ, నిబంధనలూనా ? ప్చ....పూర్ ఫెలోస్. వాళ్ళ కథేమైపోనూ ? రేప్పొద్దున్న మా నాన్న గారికి ఈ ఉదంతం తెలిస్తే జగన్నాథం డొక్క చీల్చేస్తాడు గదా ? ఈ విషయం వాడికి మాత్రం తెలీదా ? మరి తెలిసిగూడా ఈ ఎదురీత ఏమిటో ? ఒక్కటా. లక్షాతొంభై ప్రశ్నలూ, ఆ పైన వాళ్ళమీద కొండంత సానుభూతీను.

జగన్నాథం ఒకానొక ప్రేమికుడు. అతని ప్రేమ పవిత్రమైనదీ, స్వచ్ఛమైనదీను. అతని హృదయంలో సీత తప్ప మరే వస్తువుకీ స్థానం లేదు. అతను ఎవరినీ లక్ష్యపెట్టడు. కాబట్టి వో కథ రాసే యువకుడా ! వాళ్ళ ప్రేమ జయించును. అని యీ వరసతో ఆకాశ వాణి నాకు ధైర్యం చెప్తే బావుండునని పించింది.

ప్రేమికులిద్దరూ ముఖ ప్రక్షాళణం ముగించేరు. అప్పటిగ్గాని

గుర్తుకు రాలేదు అతిథి దేవుళ్ళని సత్కరించడమనే మాట మరచిపోయే నని. గోడకున్న ఫ్లాస్కు తీసి దాన్లో మిగిలున్న కాస్త కాఫీనీ యిద్దరికీ పంచియిచ్చేను.

జగన్నాధమైతే చప్పున పుచ్చుకున్నాడుగానీ.సీత మాత్రం కాస్త తటపటాయించింది.

"తాగు....అయినా ఏమిటా సిగ్గు.ఇది మనిల్లే అనుకో" అన్నాడు జగన్నాధం.

"అంతే, అంతే" అన్నాను ఏమనాలో తెలీక.

ఎలాగైతేనేం ఆ పిల్లగూడా కాఫీ పుచ్చుకుంది. నా మనసు తృప్తి చెందింది.

"ఆయితే మేం సినిమా కెళ్ళొస్తాంరా !"

"తొరగా రండి. మీకోసం ఎదురు చూస్తూంటా"

"పద సీతా ! టైమవుతోంది" అనేసి సీతను తీసుకుని వెళ్ళి పోయాడు జగన్నాధం.

ఒక గాలీవాన వొచ్చింది. ఎడాపెడా దబదబా బాది వదిలిపెట్టి వెళ్ళింది. బెదిరిపోయి ఈ సంఘటన ఏ వింత పరిణామాలకు దారి తీస్తుందోనని భయపడి పోడం ఒకానొక చదువుకునే కాలేజి కుర్రాడి వంతయ్యింది.

ఆ కాలేజీ కుర్రాడికి ఈ ప్రేమ కథలు తెలీకకాదు భయపడింది. అతనికి చాలా కథలు తెలుసు. గుళ్ళో పెళ్ళిళ్ళు చూశాడు. మదరాసో, మరొకవూరో ఉడాయించడాలూ విన్నాడు 'నాన్నా, నీ ఆస్థిలో కాణీగూడా వొద్దు. ప్రేమలేని బ్రతుకు ఒక బ్రతుకేనా ? ఈ విశాల ప్రపంచ కంలో మాకు బ్రతకటానికి చోటులేక పోలేదు. ఆశీర్వదించు వొస్తాం' అని రేపో మాపో వాళ్ళింటో ఉపన్యాసం యివ్వటానికి రెడీగావున్న మిత్రులు అతని కున్నారు. అర్ధరాత్రి బావిలోపడి 'ప్రేమహత్య' చేసు

కున్న నీలవేణినీ, దానికి కారణమై చదువూ,ఆరోగ్యమూ పాడుచేసుకుని దేశాటనంలో వున్న నరసింహారావునీ ఆ కుర్రాడు మరచిపోలేడు.

అయితే వాళ్ళందరూ వేరు. మా జగన్నాథం విషయం వేరూను. రేపొద్దున మావాడి అఘాయిత్యం తెలిసి 'నాయనా నీదారి నీది' అని ఆ కాస్త మాట మానాన్న అనేస్తే వీడెలా బ్రతగ్గలడు ? ఒక్క ప్రేమ తోనే బ్రతకడం దుస్సాధ్యం కాదా, వాడి చేతిలో తాడూ బొంగరాల్లో ఏ ఒక్కటీ లేనేలేవుగదా ! వాళ్ళంటే, వాళ్ళు చదువుకున్నవారు కాబట్టి ఎలాగోలా బ్రతకగలరు. మరి మావాడో ?

వెధవది - నాలుగేళ్ళపాటు కాలేజీలో చదువుతూ, అనువైన వాతావరణంలో పెరుగుతూన్న నేను చెయ్యలేని పనిని, ఎక్కడో దేశానికి మారుమూల ఒక కుగ్రామంలో పుట్టీ పెరిగిన జగన్నాథం ప్రేమాయణం సాగించాడంటే, చెప్పద్దూ—కాస్త ఈర్ష్య, కాస్త ద్వేషమూ, మరి కాస్త 'జాలీ' పుట్టుకొచ్చేయి.

పని మనిషిచేత కారియర్ తెప్పించి, తర్వాత తీరుబడిగా ఆలోచించడం మొదలుపెట్టాను.

పదిన్నరకి గాని సినిమాకి వెళ్ళినవాళ్ళు తిరిగి రాలేదు. రాగానే యిద్దరికీ వడ్డించాను. వాళ్ళు హాయిగా భోంచేస్తూంటే వోపక్క దిగులుగా వున్నా (మరేంలేదు—ముందేవవుతుందా ?) మరోపక్క తృప్తి చెందాను.

వాళ్ళ భోజనాలైన తర్వాత నేనూ నాలుగు మెతుకులు ఎంగిలి పడ్డాను. ఆ దరిమిలా మావాడి దగ్గరికి వొచ్చేను. 'తమరి ఆజ్ఞ ఏమిటి ప్రభో !' అన్నట్లు వాడివైపు చూపు నిలిపాను.

వాడు ఆజ్ఞ యిచ్చాడు.

"అబ్బాయ్ ! తిరిగి తిరిగి మావొళ్ళు హూనమైంది.నిద్ర ముంచు

కొస్తుంది. కాబట్టి పడుకుందాం. సీత ఆ గదిలో పడుకుంటుంది. మనిద్దరం వీధి అరుగుమీద పడుకుందాం" అని.

ఆ విధంగానే పక్కలు ఏర్పాటు చేశాం. నడుములు వాల్చాం. నిదర్ముంచుకొస్తుందని చెప్పిన జగన్నాధం నిద్రమాని వాడు ఆ పిల్లని ఎంత యిదిగా ప్రేమించిందీ, ప్రేమించబోయేదీ చెప్తున్నాడు. ముందు గమనించలేదుగాని వాడు మాకాలేజీ ప్రేమికుల తాలూకు ప్రేమని అధిగమించాడు.

బైట పడుకోట్టటం అలవాటు లేదేమో, అందులో చలిగాలి రివ్వున వీస్తుందేమో.దానికి తగినట్టు భవదీయుడి సంసారంలో దుప్పట్లు నిండుకున్నాయేమో ఆ రాత్రింతా యమయాతన అనుభవించేను. అయినా జగన్నాధం కథలో యివన్నీ మరిచిపోయేను.

ఎప్పుడు నిదర్పట్టిందో గమ్మత్తుగా పట్టేసింది. ఉదయం సీత వొచ్చి జగన్నాధాన్ని లేపుతూండగా మేలుకున్నాను. వాడికంటె ముందు నేను నిదర్లేవడం చూసి ఆ పిల్ల గుమ్మంచాటుకి వెళ్ళిపోయింది.

ఆ మర్యాదా, ఆ మన్ననా నన్ను ముగ్ధుణ్ణి చేసిన మాట నిజం.

జగన్నాధాన్ని లేపాను. వాడు వొళ్ళు విరుచుకుంటూ, గట్టిగా ఆవులించి, అష్టవంకరలు తిరుగుతూ కళ్ళు విప్పాడు.

"అప్పుడే తెల్లారిందిట్రా ... సీతా ...." అని గావుకేక పెట్టాడు.

"ఆ అమ్మాయి ఎప్పుడో లేచిందోయ్" అన్నాను.

కాలకృత్యాలు ముగించుకున్న పిదప కాఫీగట్రా పుచ్చుకొని వెళ్ళిపోయాడు వాళ్ళు. వెళ్ళేముందు కృతజ్ఞతా సూచకంగా సీత తన రెండు చేతులూ జోడించి నాకు నమస్కరించింది.

"ఎంత చక్కటి పిల్లకి మరెంత చక్కటి సంస్కారమూ" అని ఎంతో మురిసిపోయాను. భగవంతుడ్ని ధ్యానించి రెండు చేతులూ జోడించి —

"భగవంతుడా ! నువ్వన్నమాట నిజమని గట్టిగా నమ్మేవాళ్ళల్లో నే నొకడ్ని. నీ మీద పూర్తి విశ్వాసముంచాను. ఈ ఒక్క మేలు చేయి చాలు. అదీ నా గురించి కానేకాదు. ఆ జగన్నాథం, సీత-ఇద్దర్నీ చల్లగా చూడు. వాళ్ళని అనురాగ దంపతులుగా చేసే బాధ్యత నీది. ఇది నీ తలకు మించిన కార్యమేమీ కాదు. కాదూ ?...."

* * * *

బందరు పట్టణాన్ని వొదిలిపెట్టలేని నేను (సెలవల్లో) తప్పని సరిగా భావించి మా వూరు వెళ్ళేను. మా ఊరు ఏమీ మారలేదు. దెయ్యాలబావి, భూతాల రావిచెట్టూ, గంగానమ్మ గుడీ, ఆచారిగారి బడీ, ఆ ప్రక్కనే చింతచెట్టూ, చింతచెట్టు ముందు మా ఇల్లూ అన్నీ సవ్యంగా క్షేమంగా వున్నాయి.

చిన్నప్పటి స్నేహితులూ, కాస్త పెద్దయిన తర్వాత కలిసిన పెద్దలూ అందరూ నవ్వుతూ పలుకరించేరు. చావుకి సిద్ధపడిన మరి కొందరు తాతయ్యలు "బాగా మారిపోయావోయ్ చిన్నా !" అన్నారు.

రాజారావుగారు నన్ను చూడగానే ఆయన మొహంనిండా నవ్వు పులుముకోవడం పెద్ద అలవాటు. నవ్వు పులుముకున్న తర్వాత "యెలా వున్నావోయ్ ! కులాసాయేనా ? చదువెలా వుందీ ? (అదీ కులాసా యేనా ?) ఆఁ (అయ్ !)" అని నిండుగా పలుకరించడం ఆయ నొక్కడికే చేతనవును. వెర్రిమొహంపెట్టి "ఇహీ" అనడం నాకూ చాతొచ్చు.

ఆ సాయంత్రం ఆయనే చాలా విషయాలు ముచ్చటించారు. ఆ తర్వాత బందర్లో ఆడుతున్న సినిమాలు మొదలుకొని, వొచ్చే ఎన్నికల్లో ఎవరెవరు నుంచుంటున్నదీ చెప్పమన్నారు. ప్రస్తుతం కూర్చున్న వాళ్ళల్లో ఎవరు నించుంటారో నాకేం తెలుసు.

కానీ నా అవస్థ గమనించో, లేక తన ప్రయోజకత్వాన్ని నా

ముందు ప్రదర్శించాలనో, ఆయనే చెప్పేశారు పేరు పేరునా. ఎవ రెవరు ఏ పార్టీ తరపున నిలబడబోతున్నారో.

అనుకుంటున్నారుగానీ ఈ రోజుల్లో పల్లెటూళ్ళు వెనకటి పల్లెటూళ్ళు కాదు మాస్టారూ! తెలివి మీరిపోయాయి. బస్తీజనానికి వీళ్ళేం తీసిపోరు. వాళ్ళు గుడి అంటే వీళ్ళు గుళ్లో లింగమూ అంటారు.

వెనకటికి హైస్కూల్లో "నేటి మన గ్రామాలు" అనే విషయం పైన చిన్న చర్చ జరిగింది. దాంట్లో విశ్వంభర శర్మ అనిచెప్పి నా ఫ్రండొకడు (వాడి నందరూ అగ్గిపిడుగనేవారు) "మన గ్రామాలేం తక్కువకాదు. పాలిటిక్సు అక్కడే పుట్టి అక్కడే పెరుగుతాయి. రాజ్య పరిపాలనా దక్షత - మరేమో - జానపదులకే బాగా తెలుసు. ఆ తర్వాత" ఇలా గబ గబా చెప్పేస్తూంటే, యింత పరిశీలనా శక్తి అప్పట్లో లేక పోవడంవలన "వీడి బొందలే.... నోటికొచ్చినట్టల్లా వాగేస్తున్నాడు" అని వాడ్ని అపార్థం చేసుకున్నాను. ఎంత తప్పు జరిగిపోయిందీ?

రాజారావుగారు కుటుంబ విషయాలు తీసుకొచ్చి, చాలా చెప్పి ఆయన ఉపన్యాసానికి కొసమెరుపు అన్నట్టు వాళ్ళమ్మాడి చేత కాస్త కాఫీ యిప్పించి, ఆ పిల్ల కాఫీ ఎలా చేస్తుందో చెప్పి వెళ్ళిరమ్మని సెల విచ్చారు.

ఇంటికొచ్చిం తర్వాత నాన్న అడిగేరు - "రాజారావు గారింటి కెళ్ళావా" అని. నా కిలాంటి ఎత్తులంటే మహచెడ్డ చిరాకు.

నేను మావూరు వెళ్ళిన రెండోరోజుల వరకూ యీ పరామర్శలూ, పలుకరింపుల్తోటే జరిగిపోయాయి. జగన్నాధంతో పట్టుమని పదినిమిషా లైనా మాటాడేందుకు అవకాశం చిక్కనేలేదు.

మూడోరోజు—

బాగా చీకటిపడిన తర్వాత జగన్నాథాన్ని వెంటేసుకుని కాలువ

గట్టువైపు వెళ్ళాను. జగన్నాథంలో మార్పు కొట్టొచ్చినట్టు కనుపించింది. వాడు మునుపటిలా ఉత్సాహంగా లేడు. వాడి మొహంలో దిగులూ, వాడి మాటలో తొట్రుపాటూను. కారణం వాడే చెప్పేడు.

మా జగన్నాథం కథలోకి విలనుడు వొచ్చేడు. వాడిపేరు వసంత రావు. ఉద్యోగం, మునలయ్య వాళ్ళ ఊళ్ళోవున్న దేరా హాల్లో బుకింగ్ క్లార్కు. అభిరుచి, అందాన్ని ఆస్వాదించడం (ఈ ముక్క తప్పని సరిగా రాయాల్సిందే మరి.) ఆశయం వీలైనంత త్వరలో మహా పట్ట ణంలో మకాంపెట్టి తెలివితేట లుపయోగించి సొంతంగా ఏదైనా వ్యాపా రం పెట్టుకోడం.

ఈ వసంతరావు మునలయ్యతో మంచి స్నేహం సంపాయించు కున్నాట్ట. తనుపయోగించే 'సీమ మందు' మునలయ్యకి రుచి చూపించి "కంట్రీసరుకు"ని తిట్టిపోసి, "మరేటనుకున్నావ్" అని తన ప్రయోజ కత్వం నిరూపించుకున్నాడట.

మునలయ్య వసంతరావుని మెచ్చుకున్నాడు. ఇంతటి మేధావీ, నవనాగరికుడూ తన సొంత మనిషైతే ఎంత బావుండునని ఆశపడిపోతూ న్నాట్ట.

జగన్నాథం కాలువగట్టున కూర్చుని, వెన్నెల్లో మెరుస్తూన్న నీళ్ళ ల్లోకి చూస్తూ-

"మునలయ్య అఖండుడు. ఎత్తులు వేయడంలో అతన్ని మించిన వాళ్ళు లేరు. వొట్టి కక్కుర్తి రకం. నాలుగు సీసాలు చేతిలో పెడితే, చెయ్యమన్న పనిని ఆలోచించకుండా చేసేస్తాడు. సీతకి వాళ్ళ నాన్నంటే భయం. మునలయ్య గీసిన గీత దాటదు" అన్నాడు.

"అది సరేగాని, మీ ప్రేమ విషయం మా నాన్న కిప్పటికైనా తెలుసా ?" అని అడిగేను.

"ఈ మధ్యనే తెలిసింది"

"ఏమైనా అన్నాడా ?"

"లేదు. అసలా విషయం నా ముందెప్పుడూ ఎత్తలేదు.

మావాడి వ్యవహారం తాడోపేడో తేల్చుకోవడం మంచిది ఇలాటి వాటిల్లో. ఓ పక్క మబ్బులు కమ్ముకుంటూన్నా, జాప్యం చెయ్యడం పనికిరాదు. ఏమైనాసరే నాన్నగారితో జగన్నాధం గురించి చెప్పాలి. ఎలాగైనా ఆయన్ని వొప్పించి, ముసలయ్యతో మాటాడాలి, తప్పదు.

అక్కడా కాలువగట్టున మా జగన్నాధం పక్కనే కూర్చుని ఆలోచించి ఈ నిర్ణయానికి వొచ్చాను.

ఆ మరుసటి రోజు మా నాన్నగారితో ఈ విషయం కదిపాను.

"జగన్నాధానికి సీతంటే ప్రాణం."

"తెలుసు. తిరునాళ్ళలో దాన్ని వెంటేసుకు తిరిగాడటగా. నువ్వు వాళ్ళకి అతిథి మర్యాదలూ చేశావుట. నాకన్నీ తెలిశాయి" అన్నారాయన.

ఉలిక్కిపడ్డాను. మళ్ళీ అంతలోనే సర్దుకున్నాను.

"జగన్నాధం పెళ్ళి సీతతోనే జరగాలి."

"అంటే నీ ఉద్దేశ్యం ?"

ఆయన నా ఉద్దేశ్యం తెలుసుకోవాలని అడిగేసరికి కాస్త భయపడిన మాట నిజమే. కానీ అన్నీ ఆలోచించి ఒక నిర్ణయానికి వొచ్చిన తర్వాత వెనక్కి తగ్గడం ఏం బావుంటుందీ ? ధైర్యం పుంజుకుని అన్నాను :

"వాళ్ళ పెళ్ళి జరగడమే మంచిది. లేకపోతే జగన్నాధం మనకి దక్కడు."

ఆయన ఉగ్రులయ్యారు. సాక్ష్యంగా ఆయన కళ్ళు ఎర్రపడ్డాయి.

"అయితే ఎవడికోయ్ నష్టం ? ఎవడికి చెప్పి ప్రేమించాడూ ? అయినా యీ వెధవకి ప్రేమేవిటోయ్ ప్రేమ. ప్రతి అడ్డమైన వాడూ అడ్డమైన దానినీ ప్రేమిస్తే దానికి బాధ్యులెవరు ? నేను వాడి గురించి వినదలుచుకోలేదు."

"జగన్నాథం మనకు పరాయిమనిషికాడు. నేను మీకెలాగో వాడూ అంతే."

"చాల్లే....మాటలు నేర్చావ్. నోరుమూసుకుని నీ పని నువ్వు చూచుకో. అనవసరమైన హటిల్లో తల దూర్చకు."

"ఇది అనవసరమైనది కాదు" (నా ధైర్యానికి నేనే భయపడ్డాను) ఆయన నావైపు ఎగాదిగా చూసేరు. ఏదో అనబోయి ఆగిపోయారు. మళ్ళీ కాసేపటికి అన్నారు ముక్తసరిగా—

"అయితే మీరంతా ఏ గంగలోనైనా దూకి చావండి."

ఈ సలహా చెప్పి వెళ్ళిపోయారు. ఆయనలా వెళ్ళగానే యిటు జగన్నాథం వొచ్చాడు. తల వొంచుకుని గుమ్మం దగ్గరే వుండిపోయాడు. గబగబా వాడి దగ్గరికి వెళ్ళాను.

"భయపడకురా ! ఇదెంతవర కొస్తుందో నేనూ చూస్తాను" అన్నాను.

వాడు తలెత్తి నావంక చూసేడు.

"నాకులేని ధైర్యం నీ కెక్కడ్నుంచి వొచ్చిందిరా చిన్నా !" అన్నాడు.

"లేకపోతే యిన్నేళ్ళు వొచ్చినా యింకా కుర్రకుంకలూ, చేత కాని సన్నాసులూ అని అనిపించుకోమంటావా ? మర్యాద కోసం, ఆయన మీద గౌరవంకొద్దీ చెప్పి చూశాం. వినరూ, తర్వాత చేసే పనేదో చేసి చూపిస్తాం" అన్నాను.

జగన్నాధం నా చేతులు పట్టుకున్నాడు. నా కళ్ళల్లోకి తిన్నగా చూస్తున్నాడేగాని, వాడి కనుకొనల నీరు నిండుకోవడం వాడు గమనించ లేదు. గమనించిన నేను కలతచెందేను. ఏదో కీడు శంకించేను.

"ఇంత చొరవ ముందేవుంటే పరిస్థితి యింతవరకూ వొచ్చేదే గాదు" అన్నాడు బాధగా.

"ఇప్పుడు మాత్రం మించిపోయిందే ముందిలే. రేపు మునలయ్య యింటికి వెడదాం. అన్నీ చెప్దాం. వింటాడా వింటాడు. ఎదురు తిరుగు తాడా—వుండనేవుంది గాంధర్వ వివాహం. ఏది ఏమైనా మీ యిద్దరి పెళ్ళి చేసే బాధ్యత నాది" అన్నాను ఉద్రేకంగా.

వాడు ఏడుస్తూంటే అదిరిపడ్డాను. ఏమిటి వీడూ ?

"సీతో చాలా విషయాలు చెప్పలేదురా చిన్నా. అంతా అయి పోయింది. పదిరోజుల క్రితం నన్ను మునలయ్య తిట్టాడు. నేను దిక్కు లేని వాడినట. కాణీ విలువ చెయ్యని వాడినట-చాలా అన్నాడు. చెప్పరా నువ్వు చెప్పు....మీరందరూ వుండగా నాకు దిక్కులేదా, కాణీ విలువ చెయ్యనా ?"

"............"

"ఆరు నూరైనా నూరు ఆరైనా సీత పెళ్ళి వసంతరావుతో చేస్తా నన్నాడు. సీత దగ్గరకెళ్ళి అడిగేను. ఏడ్చి ఊరుకుంది" అన్నాడు జగ న్నాధం.

నా తల కొట్టేసినంత పనయ్యింది. నా నవనాడులూ కృంగి పోయాయి. కుప్పలా కూలపడ్డాను.

"కానీ - నువ్వు ఈ మాత్రం మాట సాయం చేస్తావని తెలిస్తే ఆ వసంతరావుగాడు రాకముందే మా పెళ్ళి జరిగుండేది. అయిపోయిం

దిరా చిన్నా ! నే నొట్టి దద్దమ్మని" అనేసి గబగబా వెళ్ళిపోయాడు జగన్నాథం.

జగన్నాథం భగ్న ప్రేమికు డయ్యాడు. మరొకాడూ మరొకడైతే నా కంత దిగులుండేది కాదు. సాక్షాత్తు మా జగన్నాథం. ఒక అమాయకుడు. ఒక అభాగ్యుడు - ప్రేమించాడు. ప్రేమించిన పిల్లతోనే స్వర్గమనుకున్నాడు. అలాటి వాడికి ఎదురు దెబ్బేమిటి ?

నాకు చాలామంది ప్రేమికులు తెలుసు ననే మాట ముందే మనవి చేసుకున్నాను. మా క్లాసుమేటు బుచ్చినాయన (వాడి అసలు పేరు వెంకటాద్రి) ప్రేమించి వాళ్ళింట్లోనూ ప్రియురాలి తాలూకు వాళ్ళింట్లోనూ గోలపడి భగ్న ప్రేమికుడయ్యాడు. ఆ దరిమిలా ప్రియురాలి నాన్నగారికి ట్రాన్స్ఫరైతే మరో వూరికి వెళ్ళిపోయారు వాళ్ళు. బుచ్చినాయన బ్రతకడను కున్నాం. ఖర్చురాసే అవసరం వొచ్చిందనుకున్నాం. మా పిచ్చి కాకపోతే వాడు విశాల హృదయుడన్న విషయం గుర్తించకపోవడం అన్యాయమే మరి. ఆ అమ్మడు దూరమైన తర్వాత మరి కొన్నాళ్ళకి బుచ్చినాయన మరో అమ్మడితో హృదయమనీ, అదనీ యిదనీ భాష మాటాడాడు. ఈ వరస బుచ్చినాయన నాన్నగారికి నచ్చక, వాడి చదువు మాన్పించి, పెళ్ళిచేసి ఒక యింటివాడిని చేసేడు. మొన్ననే తెలిసింది వాడొక తండ్రి అయ్యాడని.

ఈ రకం ప్రేమలైతే నేను వర్రీకాను. జగన్నాథం బుచ్చి నాన్నలా కాలేదు. మరలాంటప్పుడు జగన్నాథానికి దారేమిటి ?

ఆ రాత్రి భోజనాల దగ్గర నాన్న అమ్మతో అన్నాడు.

"రేపు రాజారావుగారికి ఖబురు పెట్టించాలి. కాస్త కనుమరుగైతే చాలు మనకే బుద్ధులు చెప్పడం మొదలు పెట్టాడు సుపుత్రుడు. ఎవడో ప్రేమించడం ఏమిటి. వాడిని వీడు వెనకేసుకు రావడమేమిటి ? తన

పెళ్ళి. తన బాగూ లేదుగానీ - ఎవడిపెళ్ళో ఎవడిబాగో కావలసి ఒచ్చిందట హుం."

నాన్నగారి మీద కోపం వొచ్చింది. ఏమిటీయన ధీమా ? ఆయన చెప్పినట్టల్లా వింటున్నాననే గదా ? నేనూ ప్రేమా పేర్మా అంటూ వినా దాలుచేసి, రోడ్లవెంట తిరిగి నలుగు రైదుగుర్ని ప్రేమిస్తే తెలిసేది నాన్నకి కొడుకెంత ప్రయోజకుడై నదీను. అవేం లేకుండా బుద్ధిగా చదువుకుంటున్నాననేగా నా మీద యింత అధికారం, యింత శ్రద్ధాను.

ఆ మరుసటి రోజే బందరు వెళ్ళిపోయాను. నా పైచదువు లయ్యేంతవరకూ, నా పెళ్ళిమాట (దయచేసి) ఎత్తరాదని ఇంటికి ఉత్తరం రాశాను.

రిజల్ట్సు వొచ్చేయి, ప్యాసయ్యాను. యూనివర్సిటీ చదువు కొరకు విశాఖపట్టణం వెళ్ళాను. ఈ మధ్యకాలంలో సీత వసంతరావుని పెళ్ళిచేసుకుని అతన్తోపాటు హైదాబ్రాద్ వెళ్ళిపోయింది. మా వాడు జీవితాన్ని తిట్టుకుని, విధిని కసితీరా శపించి మళ్ళీ మామూలు మనిషయ్యేందుకు ప్రయత్నిస్తున్నాడని విన్నాను.

ఇక్కడితో కథ అయిపోతే నిజానికి-యీ కథని యింత త్వరగా రాసేవాడిని కానేమో. నన్ను అమితంగా ఆకర్షించిన అంశం యీ రెండో భాగంలో వుంది. ఇది జరిగుండకపోతే కథ రాయటానికొక్కవలసిన యిన్స్పిరేషన్ వొచ్చేది కాదేమో.

అసలు జరిగినదిది.

నాన్న ఉత్తరం రాసేరు. ఆయనుత్తరాలని పట్టించుకోలేదు ఇంతకు మునుపు. "ఇక్కడ కులాసా. అక్కడ నీ క్షేమం వ్రాయవలెను." "ఇంతడబ్బు ఏం చేస్తున్నట్టు ? సంపాయించేవాడికి తెలుస్తుంది డబ్బు విలువ. జాగ్రత్తగా వాడుకో." "ఆరోగ్యం జాగ్రత్త. అతిగా తిరక్కు.

శ్రద్ధగా చదువుకో" — ఎప్పుడూ చదివినా యిలాటి ఉత్తరాలే. వెరైటీ అంటూ ఛస్తే వుండదు.

కానీ - ఇప్పుడు నాన్న రాసిన వుత్తరంలో చిత్రమైన వార్త లున్నాయి. మచ్చుకి....

"వారం రోజులక్రితం సీత మొగుడ్నొదిలి వొచ్చేసింది. జగన్నాధాన్నైనా యిలాగే చేసేదిగా ! అందుకనే పెద్దవాళ్ళమాట వినమని చెప్తుంటారు. మునలయ్యగాడి వంట్లో ఏమీ బాగుండలేదు. ఆ వెధవ సుఖపడతాడన్న నమ్మకం ఎవరికీ లేదు. అందరి ఋణాన్న పడ్డాడు. యిప్పుడు సీత కుంపటై కూర్చుంది. మల మల మాడి చస్తున్నారు.

జగన్నాథానికి నిడుమోలు సంబంధం కుదుర్చుకు వొచ్చాను. పిల్ల లక్ష్మీదేవిలాగుంటుంది. కట్నంకానుకలూ, లాంఛనాలూ బాగానే ముట్ట చెప్పేటట్టున్నారు. ఇన్నాళ్ళూ వాడికి నేనేదో అన్యాయం చేసినట్టు జనం ఏడ్చారు. యిప్పుడు వాళ్ళ నమ్మాలనీ, నన్ను ఆకాశానికెత్తి పారేయాలని నాకులేదు. వాడి నో యింటివాడిని చేసి, కాలవ పక్క రెండెకరాలూ వాడిపేరని రాసి నీ సంసారం నువ్వు చూసుకోమని చెప్తాను. ఎవడైనా యింతకంటే ఏం చేస్తాడు ?"

అవును మరి యింకేం చేస్తారు ? ఈ మాత్రానికి మా జగన్నాధం సుఖపడతాడనే నమ్మకం నాకులేదు. ఈ సంగతి మా నాన్నకి తెలీదా ? తెలిసి పట్టించుకోడం లేదా ?

ఏడవాలో నవ్వాలో అర్థంకాలేదు. సీత మొగుడిని వదిలి వొచ్చినందుకు ఏడవాలో, లేక మావాడు ఒక యింటివాడవుతున్నందుకు నవ్వాలో ?

సీత గొంతు కోసిన వాళ్ళల్లో ముఖ్యుడు మునలయ్య. సీత గొంతుకోసిన మునలయ్య మంచాన పడ్డాడు. అతనూ సుఖించేదేమీ లేదు

దైవ సంకల్పం కడుచిత్రంగా వుంటుందని చెప్పటానికి ఈ నిదర్శనం చాలదూ ?

నాన్న ఉత్తరం వొచ్చిన సరిగ్గా పదిహేను రోజులకి మరో చిత్రాతిచిత్రమైన సన్నివేశాన్ని చూశాను. ఆ రోజున బజారు వెడదా మనుకుంటూండగా మా రూం ముందు రిక్షా ఆగింది. జగన్నాధం, సీతా రిక్షా దిగారు. వాళ్ళిద్దరూ చిలకలపూడి తిరనాళ్ళ కొచ్చిన రోజుకంటె ఎక్కువగా ఆశ్చర్యపోయాను.

జగన్నాధం, సీతా యిద్దరూ అరుగుకిందే నిలబడ్డారు.

"అప్పుడు తిరనాళ్ళ కొచ్చిన రోజున నీ దగ్గరికి ధైర్యంగా వొచ్చేం. ఇప్పుడు యింత జరిగిన తర్వాత....ముసలయ్య పోయాడు. సీతను వెంటబెట్టుకొచ్చాను చిన్నా. చెప్పు నేను అన్నీ వదులుకుని వొచ్చేను. మీనాన్న నన్ను వెళ్ళగొట్టాడు. సీతలేని బ్రతుకు బ్రతుకు గాదు.నా సీత కష్టాలు నేను చూడలేను. బ్రతకటానికి వొచ్చాం. మార్గం చూపించి పుణ్యం కట్టుకుంటావో, లేక అందరిలాగా కసిరికొడతావో చెప్పరా చిన్నా !" అన్నాడు ఉద్రేకంగా.

మా జగన్నాధం నన్నింతవరకూ అర్థం చేసుకోలేదన్న మాట. నిజమే. తండ్రిచాటు కుర్రాడినైతే గావచ్చు. అవుతే - అంతమాత్రం చేత నా వ్యక్తిత్వం తగలబడి పోయిందా ?

నా మనసు చివుక్కుమంది.

"జగన్నాధం....నన్నింకా అనుమానిస్తూన్నావుటా్రి !"అన్నాను. ఇంకా ఏం చెప్పాలో తెలీలేదు.

వాడు అమాంతంగా నన్ను కావిలించుకున్నాడు.

"చిన్నా! చాలు నాకీ మాట" వాడి ముఖంలోకి తిన్నగా చూసేను.

వాడి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయన్న మాటేగానీ, ఆ కళ్ళల్లో తొణికిస లాడు తున్న ఆత్మవిశ్వాసం, గుండెనిబ్బరం నన్ను ఆనందపరిచాయి.

"సెభాస్ జగన్నాధం ! ఒక మామూలు మనిషి చేయలేని త్యాగాన్ని నువ్వు చేశావ్ ! నువ్వు 'ఏ' క్లాసు ప్రేమికుడివి"

నిజమూ అదేగా మాస్టారూ !

o---o